# త్యాగరాజ స్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న తులసి రెడ్డి





**త్యాగరాజస్వామి సంగీత సామ్రాజ్యానికి మకుటంలేని చక్రవర్తి**

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డా"ఎన్.తులసి రెడ్డి**

**వేంపల్లె.జూన్02.అక్షర టైమ్స్:-** స్థానిక పట్టణంలోని శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్యాగరాజస్వామి చిత్రపటాన్ని భక్తిశ్రద్ధలతో పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డా. నర్రెడ్డి తులసి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డా. సుబ్రహ్మణ్యం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. తులసి రెడ్డి మాట్లాడుతూ త్యాగరాజస్వామి సంగీత సామ్రాజ్యానికి మకుటంలేని చక్రవర్తి అని, ఆయన శ్రీరామ భక్తాగ్రేసరుడిగా, తెలుగు భాషోద్ధారకుడిగా చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. వేంపల్లికి చెందిన నాయీ బ్రాహ్మణులు, కళాకారులు త్యాగరాజ స్వామి ఆలయాన్ని నిర్మించి ప్రథమ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

# ఘనంగా త్యాగరాజ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం





**వేంపల్లె,జూన్02.అక్షర టైమ్స్:-** స్థానిక పట్టణంలోని శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేంపల్లె మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. త్యాగరాజ స్వామి మూలమూర్తికి పంచామృతాభిషేకం, మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా పట్టణ పురవీధుల్లో తాలమేళాలు, బాణసంచాల నడుమ శ్రీ త్యాగరాజ స్వామి చిత్రపటంతో గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు తెలిపారు. గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన వివిధ వేషధారణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జడ్పీటీసీ మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ రామముని రెడ్డి, టీడీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి (దిల్మాంగే)తో పాటు పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రముఖులను దుశ్శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు వెంకటరత్నం, గండికోట వెంకటశివ, జి. సిద్దయ్య, జి. పీరయ్య, డా. సుబ్రమణ్యం, కె. గంగాధర, కె. చిన్న గంగయ్య, ఎమ్. రమేష్‌బాబు, పి. సుబ్రమణ్యం, ఆర్. ప్రదీప్, పి. చంద్రాయుడు, ఆది, చంద్రబాబు, ఆర్. రామాంజనేయులు, పి. సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# జనసేన సభకు అనుమతి నిరాకరణపై అసంతృప్తి

**భావప్రకటన స్వేచ్ఛను హరించే చర్య**

**జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్**




**వేంపల్లె,జూన్02.అక్షర టైమ్స్:-** తెలంగాణలో జనసేన పార్టీ నవనిర్మాణ సంకల్ప సభకు అనుమతి నిరాకరణ పట్ల పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతుందనే భయంతోనే సభకు అనుమతి నిరాకరించారని, ప్రజాస్వామ్యంలో భావప్రకటన స్వేచ్ఛను హరించే చర్య అని ఖండించారు. ఈ కార్యక్రమంలో చెన్నకృష్ణారెడ్డి, లక్ష్మినారాయణ, శ్రీనివాసులు, కృష్ణయ్య, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్కే వ్యాలీ నూతన డైరెక్టర్‌గా జి.విజయ్ ప్రకాష్

**క్యాంపస్ అభివృద్ధికి కృషి చేస్తాన్న డైరెక్టర్**





**వేంపల్లె,జూన్02.అక్షర టైమ్స్:-** ఇడుపులపాయ పరిధిలోని ఆర్జీయూకేటీ ఆర్కే వ్యాలీ నూతన డైరెక్టర్‌గా ఐఐటి ఢిల్లీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న జి. విజయ్ ప్రకాష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం క్యాంపస్‌లోని వివిధ విభాగాల అధిపతులతో సమావేశమై విద్యా, పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జి. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ క్యాంపస్ సమగ్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు సంస్థ ప్రతిష్ఠను మరింత పెంపొందించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి డా. పి. రవికుమార్, డా. కొండారెడ్డి, డా. రత్నకుమారి, అసోసియేట్ డీన్స్, ఎస్టాబ్లిష్మెంట్ కోఆర్డినేటర్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణ ఆరోగ్య సేవలు వెన్నెముకగా ఆశ వర్కర్లు

**ప్రజారోగ్య పరిరక్షణలో ఆశ వర్కర్ల సేవలు అమూల్యం**

**ఆశ వర్కర్లు డే వేడుకల్లో డాక్టర్ ఎమ్మెల్యే పార్థసారథి**







**ఆదోని,జూన్02.అక్షర టైమ్స్:-** ఆదోనిప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్య శాఖ అధికారులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు అందరూ సమన్వయంతో ముందంజలో ఉండాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పిలుపునిచ్చారు. మంగళవారం ఆశా వర్కర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానికంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఆశా వర్కర్లు మరియు ఏఎన్ఎంల పాత్ర అత్యంత కీలకమని కొనియాడారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అందుతున్న సేవలను, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. వైద్య సేవల్లో ఏ చిన్న సమస్య ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించడానికి తమవంతు పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు.కార్యక్రమం లో డి.ఎం.హెచ్.ఓ కామేశ్వర ప్రసాద్,డిప్యూటీ డి. ఎం.హెచ్.ఓ సత్యవతి,మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎం లు,ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై ఆశ వర్కర్లకు అవగాహన





**ఆదోని,జూన్02.అక్షర టైమ్స్:-** జిల్లా ఎస్పీ విక్రాంత్ పటేల్‌ఆదేశాల మేరకు ఆదోని సబ్ డివిజన్ శక్తి టీం సభ్యులు రాజేశ్వరి, వీరాంజనేయ ఆధ్వర్యంలో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అడిటోరియంలో ఆశ వర్కర్లకు శక్తి సోస్ యాప్ పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి యాప్ ద్వారా మహిళలకు అందుబాటులో ఉన్న భద్రత సేవలను వివరించి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవడం, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రత్యేకంగా చూపిస్తూ శిక్షణ అందించారు. అనంతరం బాల్య వివాహాల నివారణ, మహిళలు మరియు బాలికల భద్రత సైబర్ నేరాల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఇటీవల పెరుగుతున్న డిజిటల్ అరెస్ట్ మోసాల గురించి వివరించి, అనుమానాస్పంద కాల్స్ సందేశాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు అందిస్తున్న హెల్ప్ లైన్ సేవలను వినియోగించుకోవాలని, మహిళలు ఎదుర్కొన్న సమస్యలను వెంటనే సంబంధిత హెల్ప్ లైన్ నంబర్లకు తెలియజేయాలని శక్తి టీం సభ్యులు సూచించారు. ఆశ వర్కర్లు తమ పరిధిలోని మహిళలకు శక్తి యాప్ సేవలను చేరవేసి భద్రతపై మరింత అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం లో భాగంగా హెల్త్ డిపార్ట్మెంట్ ఎండి కామేశ్వరరావు ప్రసాద్, డీఎంహెచ్వో సత్యవతి, ఏఎన్ఎం ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో న్యూక్లియస్ కళాశాల విజయదుందుభి




**నంద్యాల,జూన్02.అక్షర టైమ్స్:-** 2026 సంవత్సరానికి గాను ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ (జీజుజు అడ్వాన్స్ ) ఫలితాలలో న్యూక్లియస్ కళాశాల విద్యార్థులు మరోమారు ప్రతిభ చాటారు. కళాశాల విద్యార్థిని సి.ఎన్. నాగ హర్షిత రెడ్డి జుబొ కేటగిరీలో 5108 ర్యాంకు, బి. సోఫియా దీ-కేటగిరీలో 10216 ర్యాంకు సాధించారు. ఐఐటీలలో సీట్లు పొందగలిగే ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ మురళీధర్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్, డైరెక్టర్ వాసుదేవరెడ్డి అభినందించారువీరితో పాటు మరికొందరు విద్యార్థులు ఎన్ఐటీ (చీు) మరియు ఐఐటీలలో సీట్లు పొందగలిగేలా జేఈఈ మెయిన్స్ (జీజుజు మెయిన్ ) లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. గతంలో (2025లో) కూడా ఈ కళాశాలకు చెందిన శ్రీరాములు లిఖిత్ ఐఐటీ మద్రాస్, అనీస్ తబస్సుమ్ ఐఐటీ పాలక్కాడ్‌లలో సీట్లు సాధించారు. వీరితో పాటు ప్రదీప్ - ఎన్ఐటీ తేజ్‌పూర్, స్నేహలతారెడ్డి - ట్రిపుల్ ఐటీ ధార్వాడ్, పద్మ మీనాక్షి - ట్రిపుల్ ఐటీ కర్నూలు, సబీరా - ట్రిపుల్ ఐటీ కర్నూలులో సీట్లు పొందారు. అలాగే 2026 ఇంటర్మీడియట్ ఫలితాలలో సైతం ప్రథమ, ద్వితీయ సంవత్సరాల అన్ని గ్రూపులలో ఈ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఉత్తమ ఫలితాలు సాధించారు.

# మానసిక ప్రశాంతత కోసం యోగా,ధ్యానం

**బద్వేల్ అర్బన్, రూరల్ సీఐ లు రామకృష్ణ, కృష్ణయ్య**





**బద్వేల్,జూన్02.అక్షర టైమ్స్:-** నిత్యం ఒత్తిడితో కూడిన పోలీసులు విధి నిర్వహణలో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు నిర్దేశించిన యోగ, ధ్యానం బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్ ఆవరణం లో బద్వేల్ అర్బన్, రూరల్ పోలీస్ సిబ్బంది కి హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ మూడవరోజు( చివరి రోజు)లో భాగంగా ధ్యాన గురువు టీచర్ మస్తాన్ రెడ్డి ఆధ్వర్యంలో యోగా, ధ్యానం కార్యక్రమం నిరహించారు. ఈ సందర్భంగా బద్వేల్ అర్బన్, రూరల్ సీఐ లు రామకృష్ణ, కృష్ణయ్య లు మాట్లాడుతూ నిత్యం ఒత్తిడికి లోనయ్యే పోలీసులకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ యోగ తరగతుల ద్వారా నిత్యం మానసిక, శారీరక ఒత్తిడికి గురయ్యే తమకు ప్రశాంతత, మంచి ఆరోగ్యం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో బద్వేల్ అర్బన్, రూరల్ యస్.ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రెండు చుక్కలతో పోలియో మహమ్మారిని తరిమేద్దాం

**తొట్టిగారిపల్లె వైద్యాధికారి రాజేష్ కుమార్**






**బద్వేల్,జూన్02.అక్షర టైమ్స్:-** పోలియో రాకుండా చిన్నపిల్లలకు రెండు పోలియో చుక్కలు వేసినట్లయితే, పోలియోను పూర్తిగా నివారించవచ్చని తొట్టిగారిపల్లె వైద్యాధికారి రాజేష్ కుమార్ అన్నారు. బద్వేల్ పట్టణంలోని తొట్టిగారిపల్లె లో మంగళవారం ఆశ సమావేశం సిహెచ్ఓ చంద్రావతి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పల్స్ పోలియో కార్యక్రమం ఈనెల 28, 29 ,30 ,మూడు రోజులపాటు కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలంలో పోలియో బూతులను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మొదటి రోజు బూతులలో, రెండు, మూడు రోజులలో ఇంటింటి సర్వే చేసి, మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం జరుగుతుందన్నారు. 0 నుండి 5 సంవత్సరాల పిల్లలకు, తల్లిదండ్రులు తప్పక పోలియో చుక్కలను వేయించాలన్నారు. దోమలు పుట్టకూడదు, కుట్టకుండా లార్వా సర్వే చేయాలన్నారు. అప్టేట్, ఆయిల్ బాల్స్ వేసి దోమలను లేకుండా చేయాలన్నారు. డెంగ్యూ మలేరియాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, వాటిని రాకుండా నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జనార్దన్ రావు, ఏఎన్ఎంలు, ఆశాలు, పాల్గొన్నారు.

# కలియుగ కర్ణుడుగా నిలిచారు నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త గోళ్ళ రాజేష్

రాజకీయ నాయకులు గోళ్ళ రాజేష్ ను ఆదర్శంగా తీసుకోవాలని కోరుతున్నారు

స్థానిక ప్రజలు, రాజకీయ మేథావులు

జర్నలిస్టులకు రెండు నెలలకు ఒకసారి 3000 రూపాయలు ఆర్థిక సాయం అందిస్తున్న గోళ్ళ రాజేష్

సంవత్సర కాలానికి పైగా ఎవరూ చేయని ఎన్నో రకాల సంక్షేమ పథకాలు, సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడమే కాక వాటిని అమలుచేస్తున్నారు గోళ్ళ రాజేష్నియోజకవర్గంలోని ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే

లక్ష్యంగా ముందుకు వెళుతున్నారు గోళ్ళ రాజేష్

**నంద్యాల,జూన్02.అక్షర టైమ్స్:-** నంద్యాల పట్టణంలో జర్నలిస్ట్ నూర్ భాషా సహకారంతో గోళ్ళ రాజేష్ అనేక సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా నిర్వహిస్తూ నేటి సమాజానికి కలియుగ కర్ణుడు గా నిలిచారు నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త,సామాజికవేత్త గోళ్ళ రాజేష్.ప్రస్తుతం పత్రికా రంగంలో పనిచేస్తున్న పాత్రికేయులకు ఎలాంటి వేతనాలు లేక అనేక ఎన్నో ఇబ్బందులు పడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిధిగా పని చేస్తున్న ఎలక్ట్రానిక్,పత్రిక రంగాలలో పనిచేస్తున్న విలేకరులకు తనవంతుగా రెండు నెలలకు ఒకసారి ప్రతి విలేకరికి 3000 చొప్పున గౌరవ వేతనం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. దీంతోపాటు నంద్యాలలో ఎన్నోరకాల సంక్షేమ పథకాలతో పాటు ఎవరూ తీసుకోలేని సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడం వాటిని ఎలాంటి అవాంతరాలు లేకుండా నంద్యాల నియోజకవర్గంలోని ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న గోళ్ళ రాజేష్ సేవలను కొనియాడుతున్నారు స్థానిక ప్రజలు,రాజకీయ మేథావులు.గతంలో కౌలు రైతులకు మోంద తుఫాను వల్ల వచ్చిన పంట నష్టం దృష్టిలో ఉంచుకొని గోళ్ళ రాజేష్ తనవంతు సహాయంగా దాదాపు 150 మందికి పైగా కౌలు రైతులకు 3000 చొప్పున 150 మందికి పైగా రైతులకు 4 లక్షలకు పైగా ఆర్థిక సాయం అందించిన గొప్ప మనసున్న వ్యక్తి గోళ్ళ రాజేష్ అని ప్రశంసిస్తున్నారు. దీర్ఘాయుష్మాన్ భవ పథకం ద్వారా పేద,మధ్య తరగతి ప్రజల దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రతినెల 2000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు, అంతేకాకుండా పేద ప్రజలకు ఒక్క రూపాయికే రుచికరమైన ప్లేట్ చపాతి,కర్రి,పప్పు,ఒక్క రూపాయికే రుచికరమైన భోజనం,ఆహారం అందించడం జరుగుతుంది,మొబైల్ క్యాంటీన్ వాహనము నంద్యాల పట్టణంలోని ప్రధాన కోడలలో తిరుగుతూ ప్రజలకు అతి తక్కువ ధర కేవలం ఒక్క రూపాయికే రుచికరమైన ఆహారాన్ని అందిస్తూ ప్రతి ఒక్కరి కడుపును నిప్పుతున్నారు. నిరుద్యోగ యువతీ,యువకులకు నిరుద్యోగ వికాస భృతి ద్వారా ఒక్కొక్కరికి 2000 వేల రూపాయలు అందిస్తున్నారు.అదేవిధంగా రాబోవు కాలంలో కౌలు రైతులకు ఒక్కొక్కరికి ఒక బస్తా యూరియా, ఒక బస్తా డి.ఏ.పి,ఒక బస్తా అమోనియం లక్షల రూపాయల విలువైన ఎరువులను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. నంద్యాల ప్రజలకు మరియు జర్నలిస్టులకు గోళ్ళ రాజేష్ చేసే సేవలను మరవలేవని వారు తెలిపారు నేటి సమాజంలో రాజకీయ నాయకులు అందరూ గోళ్ళ రాజేష్ ని



ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాలు చేయాలని ప్రజలు జర్నలిస్టులు కోరారు.రాబోయే రోజుల్లో నంద్యాల ప్రజలకు మరెన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తూ వారి మన్ననలు పొందుతున్న గోళ్ళ రాజేష్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించాలని నంద్యాల ప్రజలు భగవంతునికి మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నారు.

# కూటమి ప్రభుత్వ వెన్నుపోటుకు రెండేళ్లు

మోసాలు, నయవంచనపై పుస్తకం,పోస్టర్,కరపత్రాల ఆవిష్కరణ చేసిన వైసీపీ నాయకులు

**నంద్యాల,జూన్02.అక్షర టైమ్స్:-** తెలుగునాట ప్రజాస్వామ్యం నిలువునా వంచనకు గురైందా? అధికార పీఠం కోసం ఇచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా? నమ్మి ఓటేసిన రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన బహుమతి "వెన్నుపోటు" మాత్రమేనా?అవుననంటోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ! నేడు నంద్యాల వేదికగా వైసీపీ జిల్లా కార్యాలయంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల వైఫల్యాలపై వైసీపీ నేతలు జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మాజీ ఎమ్మెల్యే లు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, గంగుల బీజేంద్రనాథ్ రెడ్డి, సిఇసి మెంబర్ పి.పి నాగిరెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ పరిశీలకుడు పి.పి మధుసూదన్ రెడ్డి, హాజరై వెన్నుపోటు రెండేళ్లు...కూటమి ప్రభుత్వ మోసాలపై పుస్తకం, వాల్ పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించి యుద్ధభేరి మ్రోగించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో,జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 2 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా, ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నెరవేర్చలేదని, రాష్ట్ర ప్రజలను నయవంచన, మోసం చేసి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలను కల్పించలేదని నిరుద్యోభృతి మహిళలకు శ్రీనిధి పథకం అమలుకలేదని తల్లికి వందనం, రైతుభోరోసా వంటి పథకాలను పూర్తిస్థాయిలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించలేది, మొక్కజొన్న రైతులను నట్టేట ముంచారని, అలాగే జొన్నల కొనుగోలుకూడా అరకొరగా చేపట్టారని విమర్శించారు.



ఎన్నికల సమయంలో మీడియా ప్రతినిధులకు మూడు బెడ్రూమ్ల ఇళ్లు ఉచితంగా ఇస్తామని నంద్యాల శ్రీనివాస్ సెంటర్లో ప్రకటించిన హామీని సైతం ప్రభుత్వం అమలు చేయలేదన్నారు.ప్రజలతో పాటు మీడియా ప్రతినిధులను కూడా మోసం చేసిన ప్రభుత్వం ఇదేనని విమర్శించారు .2029లో వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి మీడియా ప్రతినిధుల సొంతింటి కలను సాకారం చేస్తారని చెప్పారు..!! "విజన్ కాదు.. వెన్నుపోటే టీడీపీ నైజం" అంటూ మండిపడ్డారు. అధికారంలోకి రాకముందు ఆకాశమే హద్దుగా హామీల వర్షం కురిపించారని, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందన్నారు. టీడీపీ రెండేళ్ల వైఫల్యాలను ఎండగట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియా సమావేశాల్లో జగన్నామస్మరణ తప్ప రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రస్తావించలేదన్నారు. డైవర్ట్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. నంద్యాల నియోజకవర్గంలో సీనియర్ మంత్రి ఈ రెండేళ్ల పాలనలో నంద్యాలలో ఎటువంటి అభివృద్ధి చేపట్టలేదని, వైసీపీ అధికారంలో ఉన్న కాలంలో చేపట్టిన పనులను నేటికి పూర్తి చేయలేదని 6సార్లు మంత్రి పదవిలో ఉన్న సీనియర్ నాకయుడు నంద్యాల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. నంద్యాలలో దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్సార్ విగ్రహాన్ని నడిబొడ్డులో సీసీ కెమెరాల మధ్య పట్టపగలు విగ్రహాన్ని ధ్వంసం చేస్తుంటే పోలీసు వ్యవస్థ పర్యవేక్షణలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూంలో విద్వంస దృశ్యాలను చూస్తూ ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఇది పోలీసు నిఘావైఫల్యంగా భావిస్తున్నామన్నారు. ఒక పథకం ప్రకారం విగ్రహాన్ని ధ్వంసం చేసి వైసీపీ కార్యకర్త అని ముద్రవేసి పథక రచన చేశారని, టీడీపీ నాయకుల తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి గురించిన వివరాలను ఫోటోలను ఘటన జరిగిన కొద్ది నిమిషాల్లో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం దారుణంగా ఉందన్నారు. ఆ వ్యక్తి పై పోలీసులు కఠిన చర్యలు చేపట్టకపోగా టీడీపీ వారు ఇచ్చిన స్క్రిప్ట్ ప్రకారం వ్యవహరించారని విమర్శించారు. మతిస్థిమితం లేదని ఒక సారి, వైసీపీ కార్యకర్త అని మరోసారి ఇలా వారు ఇష్టం వచ్చినట్లుగా పోలీసులు వంతపాడారని అన్నారు. తమకు నచ్చిన రీతిగా స్టేట్మెంట్ తీసుకొని బెయిలబుల్ కేసును నమోదు చేశారని పేర్కొన్నారు. కేవలం తమ అదినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలమేరకు సంయమనం పాటించమన్నారు. డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే విగ్రహధ్వంసం కుట్ర జరిగిందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. కార్యక్రమంలో నంద్యాల నియోజకవర్గం పరిశీలకుడు సద్దల సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ శశికళ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్స్ రామలింగా రెడ్డి, సాయినాథ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాల్మిల్ అమీర్, మేధావుల విభాగం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, జిల్లా అధికార ప్రతినిధి అనీల్ అమృతారాజ్, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ పురుషోత్తమ రెడ్డి, జిల్లా ఎస్టీ కార్యవర్గ సభ్యులు శంకర్ నాయక్, వైసీపీ నాయకులు లాల్ స్వామి, సాయిరాం రెడ్డి, కృష్ణ మోహన్, శ్రీకాంత్ రెడ్డి, మునయ్య, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శివపార్వతుల అభిషేక కార్యక్రమం మరియు అన్నదానం కార్యక్రమం నిర్వహించిన నియోజకవర్గం టీడీపీ మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి










**ఓబుళవారిపల్లి,జూన్02.అక్షర టైమ్స్:-** ఓబులువారిపల్లి మండలం బొమ్మవరం గ్రామం శివాలయం నందు స్వామీ వారికి అమ్మవారికి ప్రత్యేక పూజలు మరియ అభిషేకం అన్నదానం కార్యక్రమం రైల్వేకోడూరు నియోజకవర్గ టిడిపి పార్టీ ఇంచార్జ్ మరియు కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి నియోజకవర్గం టీడీపీ మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి మరియు వారి కుటంబ సభ్యులు నిర్వహించినారు అనంతరం ఆలయ కమిటీ వారు, ప్రజలు,నాయుకులు ముక్కా వరలక్ష్మీ ని సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేయడం జరిగింది,ఈ కార్యక్రమం లో ఎన్డిఎ కూటమి నాయుకులు పాల్గొన్నారు.

# ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు 44,104 దరఖాస్తులు

ప్రత్యేక కేటగిరీ ధృవీకరణకు షెడ్యూల్ విడుదల


జూన్ 12న ఎంపిక జాబితా విడుదల : ప్రవేశాల కన్వీనర్ డా" అమరేంద్ర కుమార్




**వేంపల్లె,జూన్02.అక్షర టైమ్స్:-** ఇడుపులపాయ రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)లో 2026-27 విద్యా సంవత్సర ప్రవేశాలకు సంబంధించి మొత్తం 44,104 దరఖాస్తులు అందినట్లు ప్రవేశాల కన్వీనర్ డా. అమరేంద్ర కుమార్ తెలిపారు. ప్రత్యేక కేటగిరీల కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధృవీకరణ కోసం ప్రత్యేక షెడ్యూల్ విడుదల చేసినట్లు వెల్లడించారు. ప్రత్యేక కేటగిరీలకు చెందిన అభ్యర్థుల ధృవీకరణ కార్యక్రమాన్ని ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఎస్జీ, సీఏపీ, ఎన్సీసీ, స్పోర్ట్స్ కేటగిరీల అభ్యర్థులను తేదీల వారీగా విభజించి ధృవీకరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత విద్యార్థులకు ఈ-మెయిల్, ఎస్ఎంఎస్ల ద్వారా సమాచారం అందించడంతో పాటు, ధృవీకరణకు ఎంపికైన వారి జాబితాను విశ్వవిద్యాలయ వెబ్సైట్లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. జూన్ 5న సీఏపీ కేటగిరీకి చెందిన 85 మంది, ఎన్సీసీ కేటగిరీకి చెందిన 497 మంది, స్పోర్ట్స్ కేటగిరీకి చెందిన 167 మంది అభ్యర్థులు కలిపి మొత్తం 749 మందికి ధృవీకరణ నిర్వహించనున్నారు. జూన్ 6న సీఏపీ కేటగిరీలో 97 మంది, ఎన్సీసీ కేటగిరీలో 487 మంది, స్పోర్ట్స్ కేటగిరీలో 164 మంది అభ్యర్థులు సహా మొత్తం 748 మందికి ధృవీకరణ చేపట్టనున్నారు. అదేవిధంగా జూన్ 8న బీఎస్జీ కేటగిరీకి చెందిన 282 మంది, సీఏపీ కేటగిరీలో 55 మంది, ఎన్సీసీ కేటగిరీలో 305 మంది, స్పోర్ట్స్ కేటగిరీలో 119 మంది అభ్యర్థులు కలిపి మొత్తం 761 మందికి ధృవీకరణ నిర్వహించనున్నారు. పీహెచ్ కేటగిరీ కింద మొత్తం 195 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు. ఈ కేటగిరీకి సంబంధించిన ధృవపత్రాలను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ద్వారా ధృవీకరించనున్నందున, పీహెచ్ అభ్యర్థులు ప్రత్యేక కేటగిరీ ధృవీకరణకు హాజరుకావాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మొత్తంగా ప్రత్యేక కేటగిరీ కింద 2,453 మంది అభ్యర్థులు ఉండగా, అందులో ఎన్సీసీ కేటగిరీలో అత్యధికంగా 1,289 మంది ఉన్నారని వెల్లడించారు. స్పోర్ట్స్ కేటగిరీలో 450 మంది, బీఎస్జీ కేటగిరీలో 282 మంది, సీఏపీ కేటగిరీలో 237 మంది, పీహెచ్ కేటగిరీలో 195 మంది అభ్యర్థులు ఉన్నట్లు తెలిపారు. ప్రత్యేక కేటగిరీ ధృవీకరణ కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, ఆర్జీయూకేటీ ప్రవేశాలకు సంబంధించిన ఎంపిక జాబితాను జూన్ 12న విడుదల చేయనున్నట్లు ప్రవేశాల కన్వీనర్ డా. అమరేంద్ర కుమార్ తెలిపారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో గుడిసె ఆది కృష్ణమ్మ





**ఆదోని,జూన్02.అక్షర టైమ్స్:-** ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ( ఎస్.ఐ. ఆర్ ) పై తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షత నిర్వహించిన వర్క్షాప్లో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలు, బూత్ స్థాయి నిర్వహణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. పార్టీ శ్రేణులు ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.వర్క్షాప్లో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధ్యక్షులు పాల్గొని ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అనుసరించాల్సిన కార్యాచరణపై మార్గదర్శకాలు స్వీకరించారు. కర్నూలు జిల్లాలో కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలని గుడిసె ఆది కృష్ణమ్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# కౌతాళంలో ఉరుకుంద ఈరన్న మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెన్న బసప్ప ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తిక్క రెడ్డి జన్మదిన వేడుకలు



**కౌతాళం,జూన్02.అక్షర టైమ్స్:-** అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా కేక్ కటింగ్ కార్యక్రమం మండల కేంద్రమైన కౌతాళంలో ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థాన మాజీ టెస్ట్ బోర్డ్ చైర్మన్ చెన్నప్ప స్వగృహ ఆవరణంలో రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తిక్క రెడ్డి జన్మదిన వేడుకలు అభిమానులు, కార్యకర్తల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా అభిమానులు కేక్ కట్ చేసి,తిక్క రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం రాజు, కాశీ విశ్వనాథ్, రమేష్ గౌడ్, కురుగోడప్ప, ఉరుకుంద రవి,ఎరిగేరి మాజీ సర్పంచ్ శేఖర్,ఎరిగేరి గిడ్డయ్య,రహిమాన్, చిరంజీవి, మంజునాథ,సోమన్న, పంపన్న,భీమయ్య, పుగ్గి నాగప్ప,జాఫర్ మరియు తిక్కారెడ్డి అభిమానులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# బీజేపీ నాయకుడిపై దాడి

ఇరువర్గాలపై కేసు నమోదు చేసిన : ఎస్సై విద్య శ్రీ

**ఆదోని,జూన్02.అక్షర టైమ్స్:-** ఆదోని మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో బీజేపీ, వైసీపీ వర్గాల మధ్య మంగళవారం ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖకు సంబంధించిన భూముల వివాదం నేపథ్యంలో బీజేపీ నాయకుడు కొండాపురం నర్సిరెడ్డిపై వైసీపీ వర్గానికి చెందిన బడిగె జెమిల కుటుంబ సభ్యులు దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. బాధితుల ఫిర్యాదుల మేరకు రెండు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై విద్యశ్రీ తెలిపారు. ఘటనకు గల పూర్తి కారణాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

# పల్స్ పోలియో ప్రోగ్రాం ను పగడ్బందీగా నిర్వహించాలి

సిబ్బందికి సూచనలిచ్చిన సిహెచ్ఓ సాంబశివారెడ్డి





**బ్రహ్మంగారిమఠం,జూన్02.అక్షర టైమ్స్:-** బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 28వ తారీకున నిర్వహించే పల్స్ పోలియో ప్రోగ్రాము పగడ్బందీగా నిర్వహించాలని సిహెచ్ఓ సాంబశివారెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు.మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ డే ను నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఈనెల 28వ తేదీన జరిగే పల్స్ పోలియో ప్రోగ్రాం లో అందరూ పాల్గొని 0 టు 5 ఏళ్ల పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని చెప్పారు.అలాగే జూన్ 1 నుండి 30 వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించాలని మరియు మలేరియా రహిత సమాజంగా తీర్చిదిద్దాలని వైద్య సిబ్బందికి తెలియజేయడం జరిగింది.ప్రతి గ్రామ మరియు పట్టణ ప్రాంతాల్లో ఉండే ప్రజలను మలేరియాపై అవగాహన కల్పిస్తూ ఉండాలని ఆయన సిబ్బందికి సూచించారు.ఇంటి పరిసర ప్రాంతాలలో చుట్టుపక్కల నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించే ఏర్పాట్లను చేయాలన్నారు.ఆశా వర్కర్లు వారి గ్రామాలలో జ్వరం వచ్చిన వారి సమాచారాన్ని సంబంధిత ఏఎన్ఎంకు ఇచ్చి రోగిని ఆసుపత్రికి వచ్చే విధంగా చర్యలు చేపట్టి రక్త పరీక్షలు చేపించాలన్నారు.వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే మండల సూపర్వైజర్,మగ ఆరోగ్య కార్యకర్త ద్వారా ఉచితంగా వ్యాధిగ్రస్తులకు ఇంటి దగ్గరే రాడికల్ ట్రీట్మెంట్ ఇవ్వడం జరుగుతుందన్నారు.దోమల నివారణకు దోమతెరలు వాడాలని,పరిసరాల పరిశుభ్రత,వ్యక్తిగత పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమములో ఇంచార్జ్ డాక్టర్ సాయి తేజ,సూపర్వైజర్ పుష్పరాజ్,హెల్త్ అసిస్టెంట్ మాధవ,ఏం ఎల్ హెచ్ పి లు,ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# గొంతు నొప్పితో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సహాయం చేసిన వసుధ ఫౌండేషన్ అధినేత బి.నకేష్ రెడ్డి



**కౌతాళం,జూన్02.అక్షర టైమ్స్:-** గొంతు నొప్పితో బాధపడుతున్న వ్యక్తికి వసుధ ఫౌండేషన్ ద్వారా నేరుగా ఆర్థిక సహాయం మంగళవారం రోజున గత కొన్ని నెలలు క్రిందట నుండి గొంతు నొప్పి మరియు అనారోగ్యంతో బాధపడుతున్నటువంటి కే.ఎల్లమ్మకు పేదరికంలో ఉండి తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వసుధ ఫౌండేషన్ అధినేత బి.నకేష్ రెడ్డి ఆధ్వర్యంలో 7000 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది.ఈ సహాయం చేసినందుకుగాను నకేష్ రెడ్డికి అలాగే వసుధ ఫౌండేషన్ కు ఇలాంటి ఆపదలో ఉన్న మాకు పెద్ద మనసుతో ఆర్థిక సహాయం చేసినందుకు గాను పులి నరసింహ కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలపడం జరిగింది.